నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 14 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 13 : క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో విధులు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఈ నెల 19న తమిళనాడులో జరిగే సాధారణ ఎన్నికల విధులకు వెళ్తున్న 64 మంది హోంగార్డులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. సీపీ మాట్లాడుతూ ఎన్నికల విధులను నిబద్ధతతో పూర్తి చేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే తమకు వెంటనే సమాచారం అందించాలన్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పది రోజులైతంది.. వడ్లు కొంటలేరు

మా ఊరిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 10 రోజులైతంది. వడ్లు ఎప్పుడు కొంటరని నిర్వాహకులను అడిగితే గన్నీ బ్యాగ్‌లు రాలేదంటున్నరు. మొన్న వర్షం పడ్డది. ఈ రోజు కూడా వర్షం పడ్డది. ధాన్యం మంచిగ ఆరింది. రెండు, మూడు రోజుల సంది మబ్బులు పడుతున్నయి. ఒక్కసారిగా భారీ వర్షం పడితే మా నోట్ల మన్ను పడ్డట్లే. ఇప్పటికైనా వడ్లు కొనాలి. గతేడాది ధాన్యం తెచ్చిన వెంటనే కొన్నరు. ఈసారి ఎందుకిట్ల చేస్తున్నరో అర్థమైత లేదు.

- పెట్టం కమలాకర్, రైతు, లక్ష్మీపూర్

బీఆర్ఎస్‌తోనే ప్రగతి సాధ్యం

- కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లడిగే నైతిక హక్కులేదు
- రైతులు, ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా స్పందించని సీఎం
- బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి ప్రచారం

మంచిర్యాలలో ప్రచారంలో పాల్గొన్న కొప్పుల ఈశ్వర్, దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 13 : పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, ప్రగతి సాధ్యమవుతుందని పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గడపగడపకూ బీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి ప్రచారం చేశారు. పట్టణ వ్యాపారస్తులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని, ఆ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశామని, రైతులకు రైతుబంధు, రైతుబీమాతో భరోసానిచ్చామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యారని మండిపడ్డారు. డిసెంబర్ 9న రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని మాట తప్పాడని గుర్తు చేశారు. హామీలన్నీ అమలు చేశాకే ఓట్లు అడుగాలని, లేదా ప్రజలను మోసం చేశామని ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. ప్రధాని మోదీ తెలంగాణ విషయంలో తల్లిని చంపి బిడ్డను బతికించారని కించపరిచేలా మాట్లాడారని, ఆరు మండలాలను అన్యాయంగా తెలంగాణకు రాకుండా చేశారని, ఐటీఐఆర్, విద్యా సంస్థలు రాకుండా చేశారని మండిపడ్డారు. పంటలెండిపోయి రైతులు, గిరాకీలు లేక ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా సీఎం రేవంత్ రెడ్డి స్పందించడం లేదని చెప్పుకొచ్చారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి..

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చి, ప్రజలనుమోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ పాలన ఏ రకంగా ఉందో, రేవంత్‌రెడ్డి పాలన ఏ రకంగా ఉందో ప్రజలు బేరీజు వేసుకోవాలని, ఎవరు మంచివారో ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఏం చేసిందని బీజేపీకి ఓటు వేయాలో ఆలోచించుకోవాలన్నారు. బీజేపీకి ఓటువేస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, అప్పుడు మనం ఏదైనా ప్రశ్నిస్తే జైళ్లలో పెడుతారని అన్నారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కేసీఆర్ నాయకత్వంలో నేను చేసిందేనని గుర్తుకు చేశారు. ఇక్కడి సమస్యలు తెలిసిన వ్యక్తిగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తిగా, కార్మిక నాయకునిగా, సౌమ్యుడిగా ఎంతో పేరున్న కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ పెంటరాజయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు గాదెసత్యం, అంకం నరేశ్, బీఆర్ఎస్ నాయకులు విజిత్‌రావు, గోగుల రవీందర్‌రెడ్డి, తోట తిరుపతి, శ్రీపతివాసు, చంద్రశేఖర్ హండే, సుంకరి రమేశ్, తాజుద్దీన్, మందపల్లి శ్రీనివాస్, మొగిలి శ్రీనివాస్, అక్కూరి సుబ్బయ్య, గట్టయ్య, సుధీర్ పాల్గొన్నారు.

టైలర్ షాపులో బట్టలు కుడుతున్న కొప్పుల ఈశ్వర్

వడ్లు కొంటరా.. కొనరా ?

నాకు నాలుగున్నర ఎకరాలుంటే రెండు ఎకరాల్లో పంట కోసిన. రెండున్నర ట్రాక్టర్ల వడ్లు వచ్చినయి. గతేడాది ఎక్కడ కొన్నరో ఆ కొనుగోలు కేంద్రానికే వడ్లు తెచ్చి పోసిన. సీరియల్‌లో అందరికంటే ముందుండాలని మూడు రోజులు కిందే వచ్చిన. వడ్లు మస్తుగ ఆరినయ్. ఇగ కాంట పెట్టుడే. గతేడాది మా ఊరిలో డీసీఎంఎస్ కేంద్రం ఉండే. కానీ ఇప్పుడు మహిళా సంఘాలకు ఇచ్చిన్రు. ఇక్కడికి ఎవ్వరూ వస్త లేరు. అసలు కొంటారా.. కొనరా.. తెల్వదు. పోయినేడాది ఈ పాటికే కొనుగోలు చేసిన్రు. గిప్పుడేమో ఎవ్వరు సప్పుడు చేస్తలేరు. గిట్లా ఇబ్బంది పెట్టుడు న్యాయం కాదు.

- పెండ్యాల కొమురమ్మ, రైతు, కొత్తూరు

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం కొత్తూర్ గ్రామ శివారులో వర్షానికి వడ్లు తడవకుండా కవర్లు కప్పిన రైతులు

- చినుకు వణుకు

కేంద్రాల్లో ధాన్యం.. కండ్లలో దైన్యం

పేరుకే కొనుగోలు సెంటర్ల కేటాయింపు.. క్షేత్రస్థాయిలో ఒక్క గింజా కొనని వైనం

- సేకరణపై ఇప్పటికీ స్పష్టత కరువు
- పేరుకుపోతున్న నిల్వలు
- వానలతో తడుస్తున్న వడ్లు
- ఆందోళనలో అన్నదాతలు

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతాంగం అష్టకష్టాలు పడుతున్నది. ఎన్నో ఆశలతో వరి కోసి కేంద్రాలకు వడ్లు తరలించగా, కొనుగోళ్లు చేపట్టక పోవడంతో నిరీక్షించాల్సి వస్తున్నది. ఇప్పటికే ఆయా కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోగా, సేకరణపై యంత్రాంగం స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నది. ఇప్పటికే వానలు పడుతుండగా, తడిసిన వడ్లను చూసి కన్నీరు పెడుతున్నది.

మంచిర్యాల, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి):జిల్లాలో 2023-24 యాంసగి సీజన్‌లో 275 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు సివిల్ సప్లయ్ అధికారులు పేపర్లపై లెక్కలు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ధాన్యం కొనడం లేదు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కుప్పలుగా పేరుకుపోతున్నా, ఇప్పటి వరకు సేకరణ ప్రారంభించలేదు. ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లను ప్రారంభించినట్లు ఫొటోలకు ఫోజులివ్వడం తప్ప.. ఒక్క వడ్ల గింజనూ కొన్నది లేదు. సీరియల్‌లో ఫస్ట్ ఉంటే.. ఫస్టే కొంటారని రైతులు పది.. పన్నెండు రోజుల క్రితమే ధాన్యం తెచ్చి కేంద్రాల్లో పోయగా, అసలు కొనుగోళ్ల ఊసే ఎత్తడం లేదు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తడిసిపోతుంటే చూసి కన్నీరు పెడుతున్నారు. గడిచిన పదేళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని, వచ్చిన ధాన్యం వచ్చినట్లు కొన్నారని, ఈ ఏడాది మాత్రం అసలు కొనుగోలు కేంద్రాలు ఉన్నాయా.. లేదా.. అనేది కూడా చెబుతలేరని వాపోతున్నారు.

మంచిర్యాల నియోజకవర్గంలో విచిత్రమైన పరిస్థితి..

మంచిర్యాల జిల్లాలో డీఆర్‌డీఏ ఏజెన్సీ ద్వారా 132, పీఏసీఎస్ 106, మెప్మా 6, డీసీఎంఎస్ 31 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. గతేడాది జిల్లాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 130 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో బెల్లంపల్లిలో 25, చెన్నూర్‌లో 51, మంచిర్యాలలో 38, ఖానాపూర్‌లో 16 కేంద్రాలు ఉండేవి. జిల్లాలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 90 కేంద్రాలు, మంచిర్యాల నియోజకవర్గంలో 47 కేంద్రాలు ఉండాలి. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో డీసీఎంఎస్, పీఏసీఎస్ కేంద్రాలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు కొన్ని కేంద్రాల్లో నిర్వాహకులను మార్చారు. మంచిర్యాల నియోజకవర్గంలో మాత్రం పీఏసీఎస్ 38, డీసీఎంఎస్ 47 కేంద్రాలకు పర్మిషన్ ఇవ్వలేదు. వీటి స్థానంలో డీఆర్‌డీఏ ఏజెన్సీ ద్వారా మహిళా సంఘాలతో కొనుగోళ్లు చేస్తామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చెప్పారు. దీంతో పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో గతంలో కొనుగోలు కేంద్రాలున్న ప్రాంతాల్లో ఇప్పటి వరకు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. అసలు ఈ కేంద్రాలుంటాయా.. లేదా.. అనే విషయంలో స్పష్టత లేదు. ఇప్పటి వరకు మంచిర్యాల నియోజకవర్గంలో ఏ గ్రామంలో.. ఎన్ని కేంద్రాలున్నాయనేది కూడా అధికారులు చెప్పడం లేదు. పోనీ, 275 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇచ్చిన జాబితానైనా ఫైనలనుకుంటే.. అది కూడా ఎటూ తేల్చడం లేదు.

మిల్లుల ట్యాగింగ్ షీట్లు రాలేదు

డీసీఎంఎస్, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో స్పష్టత లేకపోవడంతో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు వస్తున్నాయి. పోనీ, డీఆర్‌డీఏ ద్వారా ఐకేపీలకు అప్పగించిన కేంద్రాల్లోనైనా ధాన్యం కొంటున్నారా అంటే అదీ లేదు. కొనుగోలు కేంద్రాలు ఫైనల్ కాకపోవడంతో మిల్లులకు ట్యాగింగ్ చేయలేదు. ఏ కొనుగోలు కేంద్రం నుంచి ఏ మిల్లుకు బియ్యం వెళ్లాలి అనే విషయంలో స్పష్టత లేదు. దీంతో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రాలకు మిల్లుల ట్యాగింగ్ షీట్లు రాలేదు. రెండు రోజుల క్రితం గన్నీ సంచులే లేవని, ఇప్పుడిప్పుడే వస్తున్నాయంటూ రైతులు చెబుతున్నారు. మిల్లుల ట్యాగింగ్ రాకపోతే ధాన్యం కొనే పరిస్థితి లేదు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టడం ఆలస్యమయ్యే కొద్దీ ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకుపోతుంది. చివరకు కొనుగోలు చేసినా లారీల లోడింగ్, అన్‌లోడింగ్ సమస్య వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో ఎప్పటి ధాన్యం అప్పుడు కొంటేనే లారీలు దొరక్క రెండు, మూడు రోజుల పాటు కల్లాల్లోనే ఎదురు చూడాల్సి వచ్చేది. ఇప్పుడు అంతా కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నా దృష్ట్యా.. రోజుల తరబడి లారీల కోసం ఎదురు చూడాల్సి వస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరి ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యలకు పరిష్కారం చూపిస్తారా.. లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

లేండిగూడకు భగీరథ నీళ్లు

- 'నమస్తే' కథనానికి స్పందించిన యంత్రాంగం
- కలెక్టర్ ఆదేశాలతో ఇంటింటికీ తాగు నీరు సరఫరా

- 'నమస్తే'కు స్పందన

కెరమెరి, ఏప్రిల్ 13 : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన లేండిగూడ గ్రామస్తులు తాగు నీటి కోసం పడుతున్న ఇబ్బందులపై 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో 'గుట్ట దిగితేనే గొంతు తడిచేది' పేరిట కథనం ప్రచురితమైంది. ఈ విషయమై కలెక్టర్ వెంకటేశ్ దోత్రే స్పందించారు. లేండిగూడలో తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎంపీవో మహ్మద్ అమ్జద్, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, మిషన్ భగీరథ ఏఈ సంతోష్ కుమార్ హుటాహుటిన లేండిగూడకు చేరుకొని మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ సరఫరా అయ్యేలా చూశారు. విద్యుత్ అంతరాయంతో పాటు పైపులైన్‌లో ఏర్పడ్డ ఇబ్బందుల వల్ల నీటి ఎద్దడి ఏర్పడిందని, మరమ్మతులు చేసి తాగు నీటి సమస్య పరిష్కరించామని, ఇకపై ప్రతి రోజూ తాగు నీరు సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, జీపీ సిబ్బంది ఉన్నారు. కాగా, తాగు నీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'నమస్తే'కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

లేండిగూడలో మిషన్ భగీరథ నీళ్లు విడుదల చేస్తున్న అధికారులు

రూ.1.10 లక్షలు పట్టివేత

వాంకిడి,ఏప్రిల్ 13 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాంకిడిలోని టోల్ ప్లాజా వద్ద శనివారం ఉదయం వాహనాల తనిఖీలు చేస్తుండగా మహారాష్ట్రలోని రాజూరాకు చెందిన గజానంద్ కారులో రూ. 1.10 లక్షలు పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఇద్దరిపై కేసు

రెబ్బెన, ఏప్రిల్ 13 : మండలంలో అనుమతులు లేకుండా ఫైనాన్స్ పేరిట అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్న పలువురి ఇళ్లలో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన మోడం సుదర్శన్‌గౌడ్, గోలేటికి చెందిన మహేందర్ ఇళ్లలో సోదాలు నిర్వహించి ప్రామిసరీ నోట్, రెండు చెక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

పరిమితికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌వో డా.సుబ్బారాయుడు
- జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలతో సమావేశం

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 13 : గ్రామీణ వైద్యులు పరిమితికి మించి వైద్యసేవలు అందిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.జీ.సుబ్బారాయుడు హెచ్చరించారు. శనివారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆర్ఎంపీలు, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలు నిర్వహించే కేంద్రాలకు ప్రథమ చికిత్స కేంద్రం అని బోర్డు పెట్టుకోవాలని, అందులో ఎలాంటి బెడ్స్ ఉండకూడదని, ఎలాంటి శాంపిల్స్ మందులు ఉండరాదని, యాంటీబయోటిక్స్ మందులు ఎట్టిపరిస్థితుల్లో వాడరాదన్నారు. ప్రజలు అత్యవసర సేవలకు 108 అంబులెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రోగులను ప్రభుత్వ దవాఖానలకు పంపంచాలేగానీ.. ప్రైవేట్ హాస్పిటల్స్‌తో సంబంధాలు ఏర్పర్చుకోవద్దని సూచించారు. ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని, ఎలాంటి సమస్యలున్నా డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివప్రతాప్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, ఆర్ఎంపీ అండ్ పీఎంపీ వెల్ఫేర్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డా. సుబ్బారాయుడు

తాగునీటి సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ చిట్యాల సతీశ్

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 13 : వేసవి నేపథ్యంలో నస్పూర్ పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 25 వార్డులకు సంబంధించిన ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్యలు తెలుసుకొని వారికి సలహాలు, సూచనలు చేశారు. మున్సిపల్ పరిధిలోని మొత్తం 25 వార్డుల్లో పైపులైను లీకేజీలు లేకుండా చూడాలన్నారు. నీటి సమస్య ఎక్కువగా ఉన్న చోట ప్రత్యేక దృష్టిసారించాలని, ఆయా వార్డులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

వడ్డీల పేరిట వేధిస్తే చర్యలు

- ఆసిఫాబాద్ అదనపు ఎస్పీ ప్రభాకర్
- కాగజ్‌నగర్ పట్టణంలోని వ్యాపారుల ఇళ్లలో సోదాలు
- అప్పు పత్రాలు, నగదు స్వాధీనం

కాగజ్‌నగర్ పట్టణంలో పత్రాలు పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 13: ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని వ్యాపారులు వడ్డీల పేరిట వేధిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు హెచ్చరించారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో ఐదు టీంలు మూకుమ్మడిగా సోదాలు నిర్వహించాయి. ఓల్డ్ కాలనీకు చెందిన సాబీర్ ఇంట్లో ప్రామిసరీ నోట్స్, నాన్ జ్యుడీషియల్ బాండ్స్, బ్లాంక్ చెక్స్, రూ.3.01 లక్షలు, తైబనగర్‌కు చెందిన చిదిరాల రాజశేఖర్ ఇంట్లో లెనోవా వాహనం, 205 మందికి సంబంధించిన అప్పు పత్రాలు, నగదు, నేషనల్ టైలర్ షాపు సమీపంలో సంతోష్ ఇంట్లో సంతకం లేని చెక్కులు, సంతకం గల చెక్కులు, నాన్ జ్యుడీషియల్ బాండ్స్, బ్యాంకు పాసు బుక్‌లు, ప్రామిసరీ నోట్స్, రాయని ప్రామిసరీ నోట్స్, ఏటీఎం కార్డులు, బంగారం, సెల్‌ఫోన్స్, రిజిస్టర్స్ లభించినట్లు ఏఎస్పీ స్పష్టం చేశారు. వీరంతా అమాయక ప్రజల వద్ద అక్రమంగా అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని, వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, పట్టణ సీఐ శంకరయ్య, రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

వాంకిడిలో..

వాంకిడి, ఏప్రిల్ 13 : మండల కేంద్రంలోని పలు వడ్డీ వ్యాపారుల ఇళ్లలో శనివారం పోలీసులు సోదాలు నిర్వహించారు. వడ్డీ, చీటీ వ్యాపారులతో పాటు ఏజెంట్లు ఇళ్లు, షాపుల్లో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. కోటిపల్లి రవి, బుట్లే కార్తీక్ వద్ద నుంచి విలువైన డాక్యుమెంట్లు, చెక్కులు, డైరీతో పాటు రూ. 2.46 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వాంకిడి ఎస్ఐ సాగర్ తెలిపారు.